క్లుప్తంగా

మద్యం మత్తులో వాహనాలు నడపరాదు



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

ఒంగోలు: మద్యం మత్తులో వాహనాలు నడపరాదని ఏఎస్పీ కె.నాగేశ్వరరావు కోరారు. ఆదివారం గ్రూప్–1 పరీక్షల బందోబస్తును పర్యవేక్షిస్తూ స్థానిక ఏకేవీకే కాలేజీ వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 48 మంది పట్టుబడగా, వారిలో 47 మందికి న్యాయస్థానం శనివారం రెండు రోజుల జైలు శిక్ష విధించిన విషయాన్ని ప్రస్తావించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుశాఖ కఠిన చర్యలు చేపడుతోందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని కోరారు.

జీవో నంబర్–1ని ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్–1ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎస్‌కే మాబు డిమాండ్ చేశారు. సంతనూతలపాడులోని బస్టాండ్ వద్ద సీపీఎం నాయకులతో కలిసి ఆదివారం జీవో కాపీలను దహనం చేసి నిరసన తెలిపారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు వివరాలు పంపాలి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సర్దుబాటు వివరాలను డీఈవో కార్యాలయానికి పంపాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోడూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వాస్తవంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న, మూతపడిన ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల అదనపు సమాచారం, అవసరమైన ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీల వివరాలను మండల విద్యాశాఖ అధికారులు పరిశీలించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్య, పనిచేస్తున్న ఉపాధ్యాయుల సంఖ్య, మిగులు ఉపాధ్యాయుల సంఖ్య, ఎయిడెడ్ సెక్షన్లకు సంబంధించిన సమాచారాన్ని జిల్లాలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు వేగవంతంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపాలని అన్నారు.

వృద్ధులు, వికలాంగులకు అన్నదానం



బిక్షాటన చేసే వృద్ధులు, వికలాంగులకు భోజనాలు పంపిణీ చేస్తున్న గౌతమ్

కొత్తపట్నం: రోడ్ల వెంబడి బిక్షాటన చేసే వృద్ధులు, వికలాంగులకు మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా భోజనాలు పంపిణీ చేశారు. కలెక్టర్ కార్యాలయం, బస్టాండ్ సెంటర్, నగరంలో ఎక్కడ ఆకలితో అలమటిస్తున్నారో వారికి భోజనాలు పంపిణీ చేశారు. ఆటోమోటర్ అధినేత ఎం.రాజేంద్ర ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీం సభ్యులు ఆర్గనైజర్ డి.కేశవ, ఎం సునీల్, డి.సుజిత్, ఎం.రాజ్‌కుమార్, వినయ్, ఎం.సన్నీబి, దానియేలు, డి.గౌతమ్ పాల్గొన్నారు.

జిల్లా ఇంజినీరింగ్ సహాయకుల సంఘ అధ్యక్షునిగా సూర్యతేజ



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా, డివిజన్ అధ్యక్షులు

పొదిలి: ఇంజినీరింగ్ సహాయకులు జిల్లా సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షులుగా సూర్యతేజను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మార్కాపురం డివిజన్ అధ్యక్షునిగా రవితేజ, కనిగిరి డివిజన్ అధ్యక్షునిగా షారూఖ్, ఒంగోలు డివిజన్ అధ్యక్షునిగా రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పొదిలి మండల ఇంజినీరింగ్ సహాయకులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఆలయ పునఃనిర్మాణానికి రూ.10,116 విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మ తల్లి ఆలయ పునఃనిర్మాణానికి పట్టణానికి చెందిన శ్రీరామ ఆజయ్‌కుమార్ ధర్మపత్ని సుజాత రూ.10,116 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు సూరం వేణుగోపాల్‌రెడ్డి, ఆవుల మాధవరావులకు అందచేశారు. ఆలయ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు.





వేదమంత్రోచ్ఛారణల మధ్య సుదర్శన లక్ష్మీనరసింహయజ్ఞం

వైభవంగా శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహ యజ్ఞం

ఒంగోలు: శ్రీ సుదర్శన లక్ష్మీనరసింహ యజ్ఞాన్ని వేదమంత్రోచ్ఛారణల మధ్య ఆదివారం వైభవంగా నిర్వహించారు. స్థానిక పీవీఆర్ బాలికోన్నత పాఠశాల పక్కన గడియారం వారి వీధిలో ఉన్న శ్రీఅనంత కోదండరామస్వామి దేవస్థానం వద్ద బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కల్యాణం బ్రహ్మోత్సవాల నిర్వాహకులు, తిరుమల తిరుపతి దేవస్థానాల ఆగమ సలహాదారులు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం అధ్యాపకులు కళ్యాణపురం రాజేష్‌కుమార్ భట్టర్ బృందంచే పాంచరాత్ర ఆగమానుసారం యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమితి నాయకులు మద్దులూరి హరిప్రేమనాథ్, గంజాం శ్రీరంగనాథప్రసాద్, మహంకాళి వెంకట శేషయ్య, సముద్రాల భీమశంకరశాస్త్రి, గడియారం సుబ్బయ్యశర్మ తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.



యజ్ఞాన్ని తిలకిస్తున్న భక్తులు

అంబేడ్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

ఒంగోలు: అంబేడ్కర్ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ నాటక ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని బ్లూవింగ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి మల్లికార్జునరావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్ఛామి నాటక వాల్‌పోస్టర్లను స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ఐదు గ్రామాల్లో నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు తెలిపారు. చీఫ్ అడ్వైజర్ డాక్టర్ శివరామకృష్ణారావు, కో ఆర్డినేటర్ కూరపాటి విజయరాజు మాట్లాడుతూ నాటక ప్రదర్శన జరిగే ఐదు గ్రామాల్లో యువతకు అంబేడ్కర్ జీవిత చరిత్రపై అవగాహన కల్పించి అంబేడ్కర్ సాహిత్యంపై పుస్తకాలను ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 13న జరుగుమల్లి మండలం వావిలేటిపాడు, 14న టంగుటూరు మండలం ఆలకూరపాడు, 15న కందుకూరు మండలం పలుకూరు, 16న కందుకూరు టౌన్‌లోని శ్రీనగర్‌కాలనీ, 17న మనుబ్రోలు మండలం వీరంపల్లి గ్రామంలో నాటక ప్రదర్శన ఉంటుందని జిల్లా కో ఆర్డినేటర్ మెడబలిమి కోటేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పద్రె వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మల్లికార్జునరావు, తదితరులు

పేదలకు అండగా ఉంటాం

మద్దిపాడు: పేదలకు అండగా ఉంటామని మన మద్దిపాడు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో నిరుపేదలకు కాంట్రాక్టర్ పోతినేని శ్రీనివాసరావు సహకారంతో ఆదివారం దుప్పట్లు, మంచాలు, ఇంట్లోకి సంబంధించిన పలు వస్తువులు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పూర్తి స్థాయిలో పేదలకు అండగా ఉండటానికి తన సంపాదనలో కొంత మొత్తం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని యువకులతో పార్టీలకు అతీతంగా నెలలో ఒక ఆదివారం నిరుపేదలకు అవసరమైన వస్తువులు అందించి వారికి ఆనందం కలిగించడమే సంస్థ ఉద్దేశమని అన్నారు. నిజంగా అవసరాలలో ఉన్న వారికి పూర్తిస్థాయిలో తమ శక్తిమేర సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో మండవ బాల చంద్రమౌళి, మండలంలోని పలు గ్రామాల యువకులు పాల్గొన్నారు.



దుప్పట్లు, మంచాలు పంపిణీ చేస్తున్న పోతినేని శ్రీనివాసరావు, బాలచంద్రమౌళి, యువకులు



ఉదయం 8 గంటల వేళ మంచు



చలి కాగుతున్న ప్రజలు

చలి పులి.. ఎప్పుడు తగ్గుతుందో మరి!

కొనకనమిట్ల: మండలంలో రెండు రోజులుగా మంచుతో పాటు చలి ప్రభావం పెరుగింది. దీంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9, 10 గంటలు దాటినా వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ సీజన్ కావటంతో గ్రామాల్లో పంట కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. కానీ మంచు వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. ప్రజలు చలి మంటలు వేసుకుని సేద తీరుతున్నారు.

అలరించిన శ్రీకృష్ణ రాయబారం నాటకం

ఒంగోలు అర్బన్: జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ప్రతి నెల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వెంకటసాయి కృష్ణ నాటక కళామండలి కనిగిరి వారితో ప్రదర్శించిన శ్రీకృష్ణ రాయబారం (పడక సీను) దృశ్య నాటక ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. దీంతోపాటు గయోపాఖ్యానం (యుద్ధసీను)ను ప్రదర్శించారు. కార్యక్రమానికి అంగలకుర్తి ప్రసాద్ అధ్యక్షత వ్యవహరించారు. దీనిలో భాగంగా మరణించిన రంగస్థల, సినీ, సాహిత్య ప్రముఖులు బి హనుమారెడ్డి, చీమకుర్తి నాగేశ్వరరావు, మార్తాటి కోటేశ్వరరావు, గూడూరి సావిత్రి తదితరులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ధేనువకొండ సుబ్బయ్య, కేఎస్వీ ప్రసాద్, మిడసల మల్లికార్జునరావు, వాకా సంజీవరెడ్డి, గంగొళ్ల నాగభూషణం, తాళ్లూరి శ్రీదేవి, అంజిబాబు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ రాయబారం నాటకంలో దృశ్యం

నేడు పెద్దదోర్నాలలో మంత్రి సురేష్ పర్యటన

పెద్దదోర్నాల: రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం పెద్దదోర్నాలలో పర్యటిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు శ్రీశైలం రోడ్డులోని హరిత హైవే రిసార్ట్స్‌లో నిర్వహించే మండల సచివాలయ కన్వీనర్ల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మండల కేంద్రంలోని 2వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో కలిసి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

గుడ్లూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాలలో 1989–94 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలు, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న, స్వగ్రామాల్లో వివిధ రకాల వృత్తులు, వ్యవసాయం చేసుకుంటున్న 100 మంది పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని గత స్మృతులను నెమరువేసుకున్నారు. చదువుకుంటున్న రోజుల్లో వారు చేసిన అల్లరి, ఆటపాటలు తమ స్నేహితులతో కలిసి ఆనందంగా పంచుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తమ చిన్ననాటి స్నేహితులు చేజర్ల ప్రసాద్‌కు రూ.20 వేలు, దాసరి రమణమ్మకు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేసి వారి ఔదార్యాన్ని చాటుకున్నారు. ఉన్నత పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందచేయాలని తీర్మానించుకున్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

చీమకుర్తి: సంతనూతలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1976–77 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం హైస్కూలు ప్రాంగణంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. 45 ఏళ్ల క్రితం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు చదలవాడ వెంకట లక్ష్మీనరసింహారావు, ఎనికపాటి భాస్కర్‌రావుతోపాటు అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.



నాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

LOSS OF DOCUMENTS

I, Denuvakonda Srinivasa Rao, S/o Venkateswarlu, resident of D.No.8/165-11/2, T2, Sri Venkateswara Residency, Rajiv Nagar, Ongole, Prakasam Dist., A.P. Hereby declare that on 03.01.2023 I lost my Original Document bearing no. 3777/ 2014 of SRO Tirupati Rural at Rajeev Nagar, Ongole. If anyone found, please Contact : 9014390936

ప్రకటన

నాక్లెయింట్ గాజుల రాము, S/o.కృష్ణమూర్తి, T.కమ్మపాలెం, ఒంగోలు అనువారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది.

నాక్లెయింట్‌కు Sy.No.115/1Cలో 21గదుల స్థలము పేర్నమిట్ట గ్రామమున కలదు. సదరు ఆస్తి తాలుకా యొక్క Original Reg Sale Deed, Dt. 11.08.1982 D.No.4079/1982 తీసుకొని తన యింటి నుండిపై స్థలం వద్దకు పోయిమరల కర్నూలురోడ్, Fly over Bridge దగ్గరకు పోయి మిగిలిన Document తో పాటుపై Original Document Xerox తీయించునప్పుడు చూడగా పై Original Document Miss అయినది 08.01.2023న. ఎంత వెదికిన దొరకలేదు. కావున ఎవరికైన దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు తెలుపవలెను.

ఒంగోలు
తేది.08.01.2023

R.V.S. Bharadwaja
Advocate
Cell:9493761705

ముగ్గుల పోటీలకు విశేష స్పందన



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న బాలికలు, మహిళలు

గుడ్లూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నెల్లూరుకు చెందిన చిన్మయి మిషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన వచ్చింది. పోటీల్లో 100 మంది మహిళలు, బాలికలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేసి రంగులు అద్దారు. పోటీలలో గెలుపొందిన మయూరి(ప్రథమ), నాని (ద్వితీయ), అమృత (తృతీయ), కావ్యశ్రీ(నాల్గవ)లకు కార్యదర్శి రాంప్రసాద్ బహుమతులు అందచేశారు.

ఆర్టిస్ట్ బ్రహ్మంకు కేంద్ర మంత్రి ప్రశంసలు



చిత్రకారుడు శేషబ్రహ్మంను సత్కరిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ ఎండీ అమిత్ జింగ్రాన్

ఒంగోలు అర్బన్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఊర్వే' ఆర్ట్ క్యాంపులో ఒంగోలుకు చెందిన చిత్రకారుడు యేలూరి శేషబ్రహ్మం హైపర్ రియలిజంతో చిత్రించిన ఆధ్యాత్మిక సంగమం పెయింటింగ్ చూసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి ముగ్ధులయ్యారు. పెయింటింగ్ విశేషాలు తెలుసుకున్న ఆయన శేషబ్రహ్మంను ప్రత్యేకంగా అభినందించారు. ఈ నెల 3 నుంచి 7వ తేది వరకు నిర్వహించిన ఆర్ట్ క్యాంపులో దేశవ్యాప్తంగా 27 మంది పేరుగాంచిన చిత్రకారులు పాల్గొన్నారు. ఆర్ట్ క్యాంపులో శేషబ్రహ్మం లైవ్ పెయింటింగ్ వేసి వీక్షకులను సైతం ఆకట్టుకున్నారు. ఆదివారం ముగింపు సందర్భంగా ఎస్‌బీఐ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అమిత్ జింగ్రాన్, నుపూర్ జింగ్రాన్ ఆయనను ఘనంగా సత్కరించి, ప్రశంస పత్రంతోపాటు జ్ఞాపిక అందజేశారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్

9010224456 90103 57744
90102 02762 90102 02856

Office mail : sakshiongads@gmail.com